# 'వ్యసనం కోసం'

మనం కొన్ని అలవాటు చేసుకుంటాం. చేసుకున్న అలవాట్లు తీవ్రమైన వ్యసనాలుగా పరిణమిస్తాయి. వ్యసనాలు మంచివీ చెడ్డవీ రెండూ ఉండవచ్చు. మంచి చెడులనేవి జనబాహుళ్య ఆచరణల మీద ఆధారపడి ఉంటాయి. మెజారిటీ ప్రజలు ఆచరించే అనుసరించే... అలవాట్లు మంచివిగా చెప్పబడుతుంటాయి. (ఇందులో ఇక భక్తి ప్రత్యేకం – ఆస్తికులకు కోపం రావచ్చుగానీ – భక్తిని వ్యవసమంటాడేమిటీ అని మీరు నిశితంగా గమనించండి. భక్తి పరాకాష్టకు చేరుకున్న భక్తుల్ని దగ్గర్నించి గమనిస్తే తెలుస్తుంది. తీవ్ర భక్తి కూడా వ్యసనమే. సరే తాగుడులాంటి అలవాట్లు జనబాహుళ్యంలో ఉన్నా కూడా దాన్ని చెడు వ్యసనంగానే పరిగణిస్తారు. (ఆ అలవాటున్నవాళ్లు బహిరంగంగా దాన్ని నిరసిస్తూ అంతరంగికంగా ఆచరిస్తూంటారు) మద్యపాన నిషేధ ఉద్యమ సమయంలో ఇలాంటి 'టప్పా'గాళ్లను చాలామందిని చూశాను.

పగలంతా మీటింగుల్లో సారా వ్యతిరేక (అధిక) ప్రసంగాలు చేసి చీకటిపడంగానే చుక్కాటలాడేవాళ్ళు.. ఇదంత ఎందుకయ్యా? అనంటారా? చెబుతా...

నేనూ మా గుండుగాడూ, ఓ దశాబ్దంన్నర క్రితం స్కూటరు మీద దక్షిణ భారత యాత్ర తలపెట్టాం. (దాంతర్వాత నేనూ భట్టూ సైకిలు మీద దక్షిణ భారతయాత్ర దిగ్విజయంగా చేశాం) మా గుండుగాడు చూట్టానికి అర్భకుడిలా కనబడ్తారుగానీ వాడికి చాలా కష్టించే శక్తి వుంది అంటారు. (grit అంటారు ఇంగ్లీష్‌లో. అది తర్వాత మా అమర్‌నాథ్ యాత్రలో తేలింది)

స్కూటర్ మీద ద.భా. యాత్ర మొదలుపెట్టి బళ్లారి మీదుగా హంపీ – బాదామీ–అయిహోళే – కిత్తూరు మీదుగా ధార్వాడ్ చేరుకుని అక్కడ్నించీ ఉత్తర కన్నడ రాజ్యంలోని సిరిసి పట్టణం చేరాము.

అక్కడ మా గుండుగాడి (ఉండారు రమణ) బాబాయి ట్యాక్స్ కన్సల్టెంటుగా ఉండేవారు. సిరిసి, కార్వార్ పట్టణాల్లో దారు శిల్పులు విపరీతం. ఒక్కో శిల్పి వర్క్‌షాప్ చూస్తుంటే కళ్లు చెదిరిపోతాయి. చనిపోయిన కాఫీ చెట్ల నుంచి మహాద్భుత కళారూపాలు చెక్కేవాళ్లు. గంధం చెక్కను వివిధ కళారూపాలుగా మలచేవాళ్లు. ఏనుగు దంతం నించి అద్భుతాలు.

సర్సరే అవన్నీ చెప్పుకుంటూపోతే ఏడు వారాల కథలౌతాయి

అక్కడ్నించి (సిరిసినించీ) జోగ్ జలపాతానికి ముందు శరావతినది గెర్సొప్పా అన్న చిన్నవూరి దగ్గర్నించీ ప్రవహిస్తుంది. దట్టమైన అరణ్యం గుండా గెర్సొప్పా దగ్గిర శరావతి నదిని దాటివెళ్తే అతి పురాతనమైన జైనమందిరాలున్నాయి. వాటిని చూట్టానికి నేనూ గుండుగాడూ బయల్దేరాం. అక్కడ మా బస గురించి గుండుగాడి బాబాయి ఏదో ఏర్పాట్లు చేశారు. అక్కడ కీకారణ్యంలో ఓ చిన్న గుట్టమీదున్న డాక్‌బంగ్లాలో మా విడిది. నేనూ గుండుగాడూ ఆ పడమటి కనుమల్లో స్కూటర్ మీద ప్రయాణిస్తూ చేరుకునేటప్పటికి చీకటి... గుట్టమీది కెళ్ళాం. నిర్మానుష్యంగా కీచురాళ్ళు అడవి జంతువులు అరుపులూ... భయం కాదు కానీ ఏదో భరించరాని భావన.

ఆ చీకట్లోంచీ ఓ భీకరాకారం. "యారు సాయబురే?" అంటూ సరే పరిచయాలూ... గట్రా... ఆ భీకరాకారం... డాక్‌బంగ్లా వాచ్‌మెన్. లోపలికి తీసుకెళ్ళాడు. తలెత్తి పైకి చూస్తే పెంకుల మీద 1857 అని ముద్ర. (ఎంత పాతదో ఆ బంగళా దాన్నిబట్టి గ్రహించొచ్చు) సరే 'భోజనం' అనడిగితే... అరగంటలో వస్తుందని వాచ్‌మెన్ సమాధానం. ఇక్కడే... అసలు కథ... మనకు వ్యసనాలుగా మారిన అలవాట్లునై కదా?... "ఏమైనా దొరుకుతుందా?" అని మా విచారణ. ఇక్కడ దొరకదు. ఓ ఏడు కిలోమీటర్ల అవతల ఓ ఊరుంది. అక్కడ దొరుకుతుందని అతని సమాధానం.

వ్యసనం వ్యసనమే కదా...

మా గుండుగాడు 'అది' లేకున్నా ఉంటాడుకానీ మనకు మాత్రం పడాల్సిందే.

సరే 'గంగాయాత్ర' పడమటి కనుమల్లో చిమ్మచీకట్లో... ఏడు కిలోమీటర్లే కదా అని...

ఏడు... పది... పదిహేను... ఇరవై... ఎంతకీ ఆ వూరు రాదు. చివరాఖర్కి... ఇరవై ఏడు కిలోమీటర్లకి తరువాత ఊరు... అక్కడ చిమ్నీ వెలుగులో వెదురు పాకలో వ్యాపారం... అక్కడ కరెంటు లేదు. మా గుండు 'బీర్'బల్... అక్కడున్నది కుండలో చల్లబర్చిన సరుకు. సరే అంత దూరం ప్రయాణం చేసీ ఫలం అని ఏదోకాని. మళ్లీ ఆ చిమ్మచీకట్లో వెనక్కి, ఇరవై ఏడు కిలోమీటర్లు.

అంతకష్టం దేనికీ అనీరోజున ఆలోచించవచ్చు. అలవాటు వ్యసనంగా మారితే అంతేకదా! ●